క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పాయకాపురం(విజయవాడరూరల్): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందచేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు. జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని 270 సచివాలయ పరిధిలో కార్పొరేటర్ ప్రారంభించారు. వలంటీర్లు, కన్వీనర్లు, సచివాలయం సిబ్బందితో పాటు కార్పొరేటర్ విజయలక్ష్మి ఇంటింటికెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సర్వీసులను అందిస్తుందని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ వీరబాబు, పార్టీ నాయకులు అలంపూరు విజయ్, రామిరెడ్డి, వెంకట్,సుభాని హైమావతి, సావిత్రి, బ్రహ్మేంద్ర గ్రేస్సి, సాంబయ్య, రాధ, గృహసారథులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నేతాజీ కాలనీలోని అంకమ్మతల్లి శక్తిపీఠం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన, శ్రీచక్రార్చన చండీ హోమం జరిగింది. నగరానికి చెందిన భక్తురాలు కుమారి అంకమ్మ తల్లికి 10 గ్రాముల బంగారు సూత్రాలను సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించి బంగారు సూత్రాలను అలంకరించారు. ఎంతో మహిమాన్వితమైన కోరిన కోరికలు తీర్చే అమ్మవారికి తన వంతు బాధ్యతగా బంగారు సూత్రాలను అందజేసినట్లు భక్తురాలు కుమారి తెలిపారు.

విలక్షణ నటుడు రంగనాథ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒక హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రంగనాథ్ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్నారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్. రామకృష్ణప్రసాద్ అన్నారు. దుర్గాపురం అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలో సోమవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ప్రముఖ సినీ నటుడు, సాహితీవేత్త, దర్శకులు రంగనాథ్ 74 వ జయంతి నిర్వహించారు. రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. వసంతకుమార్ మాట్లాడుతూ సినీనటుడు రంగనాథ్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సొసైటీ కార్యదర్శి రాము, పి.విల్సన్ రాజు, షఫీ, నాగ మల్లిక, నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

దత్తసాయి మందిరంలో నవగ్రహ హోమం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో సోమవారం ఆషాఢ అమావాస్య సందర్భంగా నవగ్రహ హోమం, లక్ష్మీపతి గణపతి హోమం, విశేష అర్చనలు పూజలు జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చారణలతో హోమాలు నిర్వహించారు. అలాగే బాబాకు ఆలయ వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిర్మానుష్య ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నిర్మానుష్య ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తప్పవని ఎస్‌ఈబీ ఏడీసీపీ రామ్ ప్రసాద్ హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే ఆప్ యార్డ్, జక్కంపూడి కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్లాట్లు, ఖాళీ ప్రాంతాలు, కాలనీ శివారు ప్రాంతాల్లో ఏడీసీపీ రామ్‌ప్రసాద్, కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అవుతు శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని తెచ్చారని, అర్హులైన ఏ ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందలేదనే ఫిర్యాదు రాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58 వ డివిజన్ సన్ సిటీ కాలనీ, మాకినేని బసవపున్నయ్య స్టేడియంలలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో పాలనలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు. సేవలు సులభతరంగా అందుతున్నాయని తెలిపారు. ఏటా సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి, ఆ ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. అందని వారుంటే ప్రతి ఆరునెలలకోసారి దరఖాస్తులు స్వీకరిస్తూ.. సంక్షేమ లబ్ధిని అందిస్తున్నట్లు వివరించారు. ఇందుకోసం ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 10 వేల మందికి పైగా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు వెల్లడించారు. 59 డివిజన్లలో 1,050 మందికి కుల, 1,023 మందికి ఆదాయ, 50 మందికి బియ్యం కార్డులు, ఇద్దరికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతో పాటు వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 2,252 సర్టిఫికెట్లను ఉచితంగా అందించినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు, సేవలతో సంతృప్తి చెందిన లబ్ధిదారులు.. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తూ 9052690526 నెంబర్‌కి ఎస్ఎంఎస్ చేయాలని కోరారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో అర్జీల పరిష్కారానికి రాష్ట్ర ప్రజలు పడరాని పాట్లు పడ్డారని గుర్తుచేశారు. కానీ అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ఇంటి ముందుకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పీఓయూసీడీ శకుంతల, నార్త్ తహసీల్దార్ మాధురి, అసిస్టెంట్ కమిషనర్ -2 అనసూయ, కార్పొరేటర్ జానారెడ్డి, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికర పరిష్కారాలు లభించాలి

మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్పందనలో వచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సూచించారు. వీఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందనలో వీరు 21 ఫిర్యాదులను స్వీకరించి అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రణాళిక విభాగం-11, ఇంజినీరింగ్ విభాగం-4, రెవెన్యూ-1, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)-2, ఎస్టేట్ విభాగం-1, అదనపు కమిషనర్ (జనరల్) విభాగం-2 వచ్చాయి. ఆయా సమస్యలను నిర్దుష్ట గడువులోపు పరిష్కారించాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం 1902, స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌లను వీఎంసీ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సచివాలయాల స్థాయిలో ఉన్న సమస్యలను సంబంధిత కార్యదర్శులు మాత్రమే పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులకు సంక్షేమాన్ని అందించేందుకు వీఎంసీ పరిధిలో అన్ని సచివాలయాల కార్యదర్శులను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ సంబంధిత విభాగం అధికారి, సచివాలయ కార్యదర్శి నేరుగా ఫిర్యాదుదారుని కలిసి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన వేదికలో అందించే ఫిర్యాదుల సంఖ్యను తగ్గించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల పనితీరును మెరుగుపరచడానికి ఆకస్మిక తనిఖీలు చేయాలని కమిషనర్ సూచించారు. చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, ఎస్టేట్ ఆఫీసర్ ఒ.శ్రీనివాస్, బయాలజిస్ట్ డి.సూర్య కుమార్, మేనేజర్ బి.శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

తోకలు కత్తిరిస్తానన్న మాటలు మరిచారా?

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈనాడు పత్రిక వాస్తవాలను విస్మరించి, ప్రభుత్వంపై నిత్యం బురద చల్లటమే పనిగా పెట్టుకుందని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య విమర్శించారు. ముఖ్యంగా విజయవాడలోని దుర్గగుడిలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు జీఓ110 పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నా.. అసంతృప్తితో ఉన్నట్లు కథలు అల్లడం సరికాదన్నారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గల ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో భక్తుల నుంచి వసూలు చేసే తలనీలాలు రుసుమును రూ.15ల నుంచి రూ.25లకు పెంచిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాయీబ్రాహ్మణుల విజ్ఞప్తి మేరకు తలనీలాల రుసుమును రూ.25ల నుంచి రూ.40లకు పెంచుతూ జీఓ 110 విడుదల చేసిందని గుర్తు చేశారు. అయితే అది ఇంకా అమలు కావటం లేదనే సాకుతో టీడీపీకి చెందిన కొందరు గత ప్రభుత్వం అవలంభించిన విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేయటం వారి గొయ్యిని వారే తీసుకున్నట్లుందని ఎద్దేవా చేశారు.

మేలులు గుర్తించాలి.. అవమానాన్ని మరిచిపోకూడదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు కలిసి తమ ఇబ్బందులను చెప్పినప్పుడు మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీకు గుర్తింపు కార్డులు ఇవ్వటంతో పాటు నిర్ణీత వేతనం అందేలా చూస్తానని హామీ ఇచ్చారని యానాదయ్య గుర్తు చేశారు. అయితే ఉద్యోగులుగా గుర్తిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చినట్లు ఈనాడు వక్రీకరించి రాసి నాయీబ్రాహ్మణుల్లో చీలిక తెస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమ కష్టాలను చెప్పుకునేందుకు సచివాయానికి వెళితే.. 'లోపలకు ఎవరు రానిచ్చారు.. అసలు మీకూ దేవాలయాలకు సంబంధం లేదు, ఎక్కువగా మాట్లాడితే గుడి మెట్లుకూడా ఎక్కనివ్వనని, తోకలు కత్తిరిస్తానని అవమానిస్తే కన్నీటి పర్యంతమై వెనుదిరిగిన వైనాన్ని దుర్గగుడిలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు మరిచిపోయారా అని ప్రశ్నించారు.

అంత స్తోమత ఉందా?

రాష్ట్రంలోని దేవాలయాల్లో పని చేసేవారి నుంచి రూ.5 కోట్లు వసూలు చేశారని ఈనాడు విషపు రాతలు రోతగా ఉన్నాయని పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే స్తోమత నాయీబ్రాహ్మణులకు ఉందా అని ప్రశ్నించారు. సీఎం జగన్ ప్రభుత్వం ఇచ్చిన చారిత్రాత్మకమైన జీఓ 110తో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో పని చేసే సుమారు 2వేలమందికి శాశ్వత పరిష్కారం లభించిందని, అందుకే దుర్గగుడి దగ్గర కేశఖండన శాల వద్ద, పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద జరిగిన కృతజ్ఞత సభలో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారని గుర్తు చేశారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ



మైలవరం: మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డులోని రేషన్ బియ్యం మెయిన్ లిఫ్టింగ్ పాయింట్‌ను ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ అదితిసింగ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అదితిసింగ్ రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. రికార్డులు తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ వెంట మైలవరం తహసీల్దారు శ్రీనివాస్, డీటీ, సివిల్ సప్లెస్ మాధవి ఉన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త కనిపించడం లేదని భార్య కొత్తపేట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇస్లాంపేట అమ్మిశెట్టి వారి వీధికి చెందిన గోవాని కవిత, వికాసం భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం, వికాసం ఇంటి డెకరేషన్ పనులు చేస్తుంటాడు. కొంత కాలంగా అతను సొంతంగా వ్యాపారం చేస్తానంటూ భార్యను డబ్బులు అడుగుతున్నాడు. తన వద్ద లేవని, తెలిసిన వారిని అడిగినా లేకపోవడంతో అదే విషయాన్ని కవిత తన భర్తకు చెప్పింది. దీంతో ఆందోళన చెందిన వికాసం ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కవిత తన భర్త కనిపించడం లేదంటూ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గోవుల సంరక్షణకు విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు సోమవారం మండలంలోని నవాబుపేట గ్రామం వద్ద ఉన్న వీఎస్ఈ ఎకో బ్లాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.36,500 విరాళాన్ని ఆలయ ఈఓ రమేష్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

రైతు బజార్‌లో కందిపప్పు విక్రయాలు



రైతు బజారులో ప్రత్యేక రిటైల్ కౌంటర్ ఏర్పాటు చేసి కందిపప్పు అందిస్తున్న జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని తగ్గించే దిశగా రైతు బజార్లలో బియ్యం, టమాటాతో పాటు కందిపప్పు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. విజయవాడ సాంబమూర్తి రోడ్డులోని రైతు బజారులో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ హోల్ సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ సొసైటీ సహకారంతో కందిపప్పు విక్రయ కౌంటర్‌ను జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. నాణ్యమైన దేశవాళీ కందిపప్పును కిలో రూ.135లకే విక్రయిస్తామని జేసీ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సబ్సిడీపై నాణ్యమైన బియ్యం, టమాటా, కందిపప్పు వంటి సరుకులను ప్రజలకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. రైతు బజార్లలో కూడా కౌంటర్లు ఏర్పాటు చేసి నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కిలో టమాటా రూ.50, కిలో సోనా మసూరి బియ్యం రూ.49, కందిపప్పు రూ.135 చొప్పున విక్రయిస్తామని వివరించారు. డీఎస్ఓ మోహన్ బాబు, ఏఎస్ఓలు సి.ధనుంజయరెడ్డి, శ్రీలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ మంగమ్మ, మహాత్మా గాంధీ హోల్ సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ సొసైటీ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, సెక్రటరీ కె నారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

శాకంబరీ అలంకారంలో అమ్మవారు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢమాసం సందర్భంగా ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో అమ్మవారిని సోమవారం శాకంబరీ దేవిగా అలంకారం చేసి పూజలు చేశారు. పలు రకాల కూరగాయలు, పండ్లుతో అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని ఎస్ఎన్‌పురం పోలీసులు సోమవారం అరెస్టు చేసి 1.40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పైపులరోడ్డుకు చెందిన పోలిశెట్టి నాగకుమార్ ఇతర ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలోని కాల్‌టెక్స్‌రోడ్డు, బస్‌స్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్ఐ దుర్గామహేష్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగు సోదా చేయగా గంజాయి లభ్యమైంది. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు.

రేపు హుండీ లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం దేవదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, సేవాసమితి సభ్యుల పర్యవేక్షణలో జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59 వ డివిజన్ 254 వ వార్డు సచివాలయ పరిధి అజిత్‌సింగ్‌నగర్లో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎండి షాహినా సుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నగర పాలక సంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలకు వలంటీర్‌లు దిక్సూచిగా వ్యవహరిస్తూ అండగా నిలుస్తున్నారని లబ్ధిదారులు చెప్పడం ఆనందంగా ఉందన్నారు. అటువంటి వ్యవస్థను బదనాం చేసేందుకు ప్రతిపక్షాలు యత్నించడం బాధాకరమన్నారు.

లోకేష్ అవుట్ డేటెడ్ నాయకుడు...

టీడీపీ నాయకుల మాటలు కోటలు దాటుతున్నా.. సభలు మాత్రం వెలవెలబోతున్నాయని ఎద్దేవా చేశారు. టీడీపీ నేత నారా లోకేష్ చేస్తున్న యువగళమే ఇందుకు నిదర్శనమన్నారు. లోకేష్ ఒక అవుట్ డేటెడ్ నాయకుడని.. యువగళం ఒక అట్టర్ ఫ్లాప్ షో అని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో చెప్పకుండా, తిరిగి అధికారంలోకి వస్తే ఏమి చేస్తారో వివరించడం గత పాలకుల చేతగానితనానికి అద్దం పడుతోందన్నారు. మూడు సార్లు అధికారంలోకి ఉండి పేదల జీవన స్థితిగతుల్లో మార్పు తీసుకొచ్చేలా ఒక్క మంచి కార్యక్రమాన్ని అయినా చంద్రబాబు చేపట్టారా..? కనీసం ప్రజలందరూ గుర్తుంచుకునేలా ఏ ఒక్క మంచి సంక్షేమ పథకాన్ని అయినా ప్రవేశపెట్టారా..? సమాధానం చెప్పాలన్నారు. మంగళగిరిలో చిత్తుగా ఓడిపోయినా.. ఉత్తర కుమార ప్రగల్భాలను లోకేష్ నేటికీ మానుకోలేదని వ్యాఖ్యానించారు. అడ్డదార్లలో ఎమ్మెల్సీ, ఆ తరువాత మంత్రి పదవి అవడం కాదని.. ధైర్యముంటే ప్రజాక్షేత్రంలో గెలిచి మాట్లాడాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు హఫీజుల్లా, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పనులపై సూచనలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కార్పొరేటర్ శిరీష తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిర్దేశించిన సమయంలోగా నాణ్యతా ప్రమాణాలతో ఆర్‌యూబీ పనులు పూర్తిచేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మధురానగర్ ఆర్‌యూబీ పునరుద్ధరణ సందర్భంగా కార్పొరేటర్ పెనుమత్స శిరీష, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ రవితేజ ప్రాజెక్టు ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత రైల్వేగేటు, గద్దె వెంకట్రామయ్య పార్కు నుంచి మధురానగర్ వైపు చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టు సంస్థ, అధికారులకు సూచనలు చేశారు. పనులకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. సాధ్యమైనంత వరకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తిచేస్తామని కొన్ని సందర్భాల్లో మాత్రం అంతరాయం కలుగుతుందని తెలిపారు. వాహన చోదకులు అనువైన ఇతర రోడ్డు మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని సూచించారు.

నేటి నుంచి గుణదల మూడు బ్రిడ్జిలపై రాకపోకలు బంద్...

గుణదల రైల్వేట్రాక్ వద్ద నూతన మంచినీటి సరఫరా పైపులైను పనులు ప్రారంభించినందున గుణదల మూడు బ్రిడ్జిలపై రాక పోకలు మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి ట్రాఫిక్‌ను పప్పుల మిల్లు వైపు మళ్లింపు చేశామన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో సూపరిటెండింగ్ ఇంజినీర్ బి.నరసింహ మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాస్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.గుర్నాథం, అసిస్టెంట్ ఇంజినీర్, రవితేజ ప్రాజెక్టు ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష సూచించారు. ముత్యాలంపాడు గంగానమ్మ దేవాలయంలో హిమాలయ అమరగురు ఆర్య శ్రీ మహావతార్ బాబాజీ ట్రస్ట్ ఆధ్వర్యాన సోమవారం ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శిక్షకులు అమన్ హనీ ఆలీఖాన్, భానుప్రకాష్ మాట్లాడుతూ ధ్యానం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియచేసేందుకు తాము ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కార్మెల్ మాత పుణ్యక్షేత్ర మహోత్సవం



కార్మిల్‌మాత క్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

పెనమలూరు: కానూరులో మౌంట్ కార్మిల్ మాత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నవదిన ప్రార్థనల్లో భాగంగా ఆదివారం రాత్రి పరిశుద్ధ జపమాల ప్రార్థనలు ఫాదర్ బొల్లి జయరాజ్, ఫాదర్లు పృథ్వి, మందా ప్రదీప్, సలివేంద్ర శౌరి, దేవదానం చేశారు. భక్తులు కొవ్వొత్తులతో ప్రార్థనలో పాల్గొన్నారు. భక్తులకు దివ్య ప్రసాదం అందజేశారు. అనంతరం లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపదేశకులు, యూనిట్ లీడర్లు, కౌన్సిల్ సభ్యులు, గంగూరు, కానూరు, కామయ్యతోపు, పోరంకి నుంచి దాదాపు 2వేల మంది భక్తులు పాల్గొన్నారు. మహోత్సవాలకు సహకరించిన వారికి ఫాదర్లు అభినందనలు తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



ఎండీడీటీఐ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న డాక్టర్ జయమోహన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎండీడీటీఐ ప్రెసిడెంట్ డాక్టర్ జయమోహన్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యాన కృష్ణా కెనాల్‌లోని మల్టీ డిసిప్లినరీ డివిజనల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎండీడీటీఐ)లో ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టారు. జయమోహన్ సభ్యులతో కలసి ఎండీడీటీఐ పరిసరాలలో పలు రకాల పండ్ల మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ జీవవైద్యాన్ని పెంపొందించే లక్ష్యంతో పాటు సమాజానికి అవసరమైన పోషకాహారం అందించడానికి మామిడి, జామ, అరటి, దానిమ్మ పండ్ల మొక్కలు నాటాకరాంరకె. మొక్కలు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ, నేల కోత, సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ డి.శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.